క్లుప్తంగా

గ్యాస్ ధరలు తగ్గించాలి



వెంకటాపురం(కె): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరల తగ్గించాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుడు ప్రకాశ్ చేపట్టిన జన చైతన్య యాత్ర శనివారం వెంకటాపురం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు ద్విచక్ర హవానంపై యాత్రను చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలకు గ్యాస్ ధరలపై అవగాహన కల్పించి చైతన్య పరచనున్నట్లు తెలిపారు.

న్యాయం చేయండి



కాటారం: భూ వివాదంలో తమకు మండల కేంద్రానికి చెందిన పలువురితో ప్రాణహాని ఉందని, తమకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రానికి వేముల లక్ష్మి, సుగుణ, గౌతమ్ పోలీసులకు విన్నవించారు. పోలీస్‌స్టేషన్ మెట్లపై కూర్చొని తమ సమస్యను విలేకర్లకు వివరించారు. భూ వివాదంలో పలువురి బెదిరింపులతో తమ కుటుంబ పెద్ద వేముల శ్రీశైలం అనారోగ్యం పాలై చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆరోపించారు. కొందరు తమపై అక్రమంగా కేసు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులు న్యాయం చేయకపోతే తమకు ఆత్మహత్యే శరణ్యం అని వాపోయారు. విషయం తెలుసుకున్న సీఐ రంజిత్‌రావు బాధితులతో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆర్థిక సాయం



మల్హర్: మండలంలోని ఆడువాలపల్లి గ్రామానికి చెందిన రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు అజ్మీరా బాలాజీ శనివారం పరామర్శించి రూ. రెండు వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శంకర్‌నాయక్, యూత్ అధ్యక్షుడు రాజు, నాయకులు దల్ సింగ్, సమ్మయ్య, నరేష్, దేవేందర్, లక్ష్మణ్, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



టేకుమట్ల(రేగొండ): 108 వాహనంలో ప్రసవమై కవలలు జన్మించగా తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ రాజు, పైలెట్ షరీఫోద్దీన్ తెలిపారు. ఈఎంటీ, పైలెట్ తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మడిగ పద్మ శుక్రవారం అర్ధరాత్రి పురిటి నొప్పులతో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రాగా అక్కడి వైద్య సిబ్బంది హనుమకొండ మిషన్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. వెంటనే అక్కడి నుంచి 108 వాహనంలో హనుకొండకు తీసుకెళ్తున్న క్రమంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వాహనంలోనే ప్రసవం చేశారు. కాగా ఒక పాప, బాబు కవలలు జన్మించారని, వారు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం మిషన్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. సకాలంలో స్పందించి సుఖ ప్రసవానికి కృషి చేసిన ఈఎంటీ రాజు, పైలెట్ షరీఫోద్దీన్‌లకు పద్మ భర్త నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

'మద్యం పాలసీని ప్రతిఘటిద్దాం'

నర్సంపేట : మహిళల జీవితాన్ని విధ్వంసం చేస్తూ శ్రామికుల కష్టాలను దోచుకుంటున్న పాలకుల మద్యం పాలసీని ప్రతిఘటించాలని స్త్రీ సంఘటన పత్రిక ఎడిటర్ ఎం.లక్ష్మి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఈర్ల పద్మ అధ్యక్షతన శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. 8గంటల పని దినం, సురక్షిత పరిస్థితులు, వేతనాల పెంపు, సమాన పనికి సమాన వేతనానికి 150ఏళ్ల క్రితమే అమెరికా, తదితర దేశాల్లో మహిళా కార్మికులు పోరాటాలు సాగించారన్నారు. 1910లో కోపెన్ హాగన్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్ట్ మహిళల కాన్ఫరెన్స్‌లో జర్మనీకి చెందిన కమ్యూనిస్టు నాయకురాలు క్లారా జెట్‌కిన్ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని ప్రతిపాదించారన్నారు. నాటి నుంచి నేటి వరకు అంతర్జాతీయ మహిళా పోరాట దినం మార్చి 8శ్రామిక మహిళల సంఘటిత పోరాటాలు, హక్కుల సాధనకు సంకేతంగా నిలుస్తూ స్ఫూర్తినిస్తుందన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం స్త్రీ సంఘటన రాష్ట్ర కార్యదర్శి మోడెం శ్రీలత, డాక్టర్ నవత ఉన్నారు.

సర్కారు బడికి భద్రత కరువు

- దొంగలపాలవుతున్న పాఠశాల ఫర్నిచర్
- పట్టించుకోని అధికారులు



ఏటూరునాగారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల

ఏటూరునాగారం: కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ పాఠశాలకు భద్రత కరువైంది. రాత్రి అయితే చాలు అసాంఘిక కార్యక్రమాలు, మద్యం సేవించడం ఇలా అనేక రకాలుగా జరుగుతున్నాయి. జిల్లాలోనే అతి పెద్ద క్రీడా మైదానం, విశాలమైన గదులు అత్యధిక స్థాయిలో విద్యార్థుల సంఖ్య ఉండేది ఏటూరునాగారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల(జెడ్పీహెచ్ఎస్). ఈ పాఠశాలలో విద్యార్థుల కోసం అనేక సౌకర్యాలున్నాయి. ఇటీవల రూ.70 లక్షలతో మన ఊరు–మన బడి కింద అనేక మరమ్మతులు, ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయి. గతంలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన మురళి ఆధ్వర్యంలో రూ.10లక్షలు వెచ్చించి విద్యార్థులకు డ్యూయల్ డెస్కులను కొనుగోలు చేయించి అందించారు. అయితే పాఠశాలలో మరమ్మతులు జరుగుతున్నాయని ఇటీవల ఓ గదిలో డ్యూయల్ డెస్కులను భద్రపర్చారు. ఈ విషయాన్ని గమనించి ఎదురుగా ఉండే పలు సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు 35 డ్యూయల్ డెస్కులను ఎత్తుకెళ్లి ఓ వ్యక్తికి విక్రయించారు. ఈ విషయం మూడు రోజుల తర్వాత బయటపడడంతో ఆచూకీ కనుక్కొని ఆ డెస్కులను మళ్లీ పాఠశాలకు తరలించారు. ఇవే కాకుండా ఫ్యాన్లు, నీటి నల్లాలు, స్కూళ్లలో గతంలో ఉన్న నాపరాయి సైతం ఎత్తుకెళ్లిన సందర్భాలున్నాయి. ఇంతా జరుగుతున్నా స్థానిక హెడ్మాస్టర్, ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేందర్ ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. నైట్ వాచ్‌మన్ పోస్టును భర్తీ చేయకపోవడం వల్లనే ఎలాంటి భద్రత లేకుండా పోతున్నాయని తెలుపుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న పాఠశాలల గదులు, ఫర్నిచర్‌కు సరైన సెక్యూరిటీ లేక కాపాడుకోలేని దయనీయమైన దుస్థితిలో ఏటూరునాగారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉంది. మరికొన్ని రోజులు అయితే వేసవి సెలవులు. ఇంకా ఆ ఫర్నిచర్, ట్యాప్స్, నల్లాల పైపులు, ఫ్యాన్లు, కరెంటు స్విచ్చు బోర్డులు ఏ స్థితిలో ఉంటాయో అర్థం గాని పరిస్థితి. అవి ఉంటాయో లేదో కూడా అనుమానాలు తలెత్తుతున్నాయి.

పాఠశాలను కాపాడుకోవాలి



జెడ్పీహెచ్ఎస్‌లో ఉన్న వస్తువులు ప్రజలవే. వాటిని మన సొంత వస్తువులాగా కాపాడుకోవాలి. దొంగతనాలకు పాల్పడితే చట్ట ప్రకారం శిక్షింపబడుతారు. పాఠశాల దేవాలయంతో సమానం. ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిన ఈ పాఠశాలను కాపాడుకోవాలి.

– రఘు, ఏటూరునాగారం, పూర్వ విద్యార్థి

నైట్ వాచ్‌మన్‌ను నియమించాలి



జెడ్పీహెచ్ఎస్‌లో ఎన్నో రకాల విలువైన వస్తువులు ఉన్నాయి. వాటిని కాపాడేందుకు ఒక నైట్ వాచ్‌మన్‌ను ప్రభుత్వం మంజూరు చేయాలి. ఏజెన్సీలో ఇంత పెద్ద పాఠశాల ఉండడం మన అదృష్టం. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి నైట్ వాచ్‌మన్‌ను నియమించాలి.

– అజహర్, ఏటూరునాగారం, పూర్వ విద్యార్థి

గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్



మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీకాంత్

- ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లిన సిబ్బంది

వెంకటాపురం(ఎం): మండల కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న మద్దిమడుగు గొత్తికోయగూడెంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. 97 మంది గొత్తికోయలను పరీక్షించి 37 మంది నుంచి రక్తనమూనాలు సేకరించామన్నారు. గర్భిణులకు, చిన్న పిల్లలకు టీకాలు వేసినట్లు వెల్లడించారు. గూడెంలోని ప్రతి ఇంటిలో దోమల మందును పిచికారీ చేసినట్లు పేర్కొన్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసేందుకు గొత్తికోయగూడెనికి కాలినడకన సుమారు 5 కిలోమీటర్ల మేర వైద్య సిబ్బందిచే కలిసి నడిచివెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సదానందం, హెల్త్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఎల్‌టీ కృష్ణ, ఎఎన్ఎంలు స్వప్న, లక్ష్మి, శిరీష, ఆశవర్కర్లు మాధవి, సౌజన్య, శోభ, సంపూర్ణ, ఇందిరతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ సర్వీస్ పునఃప్రారంభం



ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని వెంచరామి–కుర్మపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్ సర్వీస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చొరవతో పునఃప్రారంభమైనట్లు సర్పంచ్ సిద్ధంకి భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పది రోజుల నుంచి తమ గ్రామానికి బస్ సర్వీస్ రాక పోవడంతో మండల కేంద్రానికి పోవడం చాలా ఇబ్బంది పడ్డామన్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోవడంతో వెంటనే పరకాల బస్ డిపో మేనేజర్‌తో మాట్లాడారని పేర్కొన్నారు. ఈ బస్ సర్వీస్ రేగొండ మండలం కోటంచ మీదుగా కాకుండా చిట్యాల మండల కేంద్రం నుంచి రావాలని కోరారు. అనంతరం ఆర్టీసీ బస్‌కు కొబ్బరి మట్టలు కట్టి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని అందుకుతండ గ్రామానికి ప్రత్యేకంగా నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భుక్య సుజాత రాజు నాయక్, గ్రామస్తులు అజ్మీర నందు నాయక్, రాజేందర్, దేవేందర్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, సదయ్య, మోహన్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని భూపతిపూర్ గొత్తికోయగూడెంలో ఇటీవల మృతి చెందిన ఇద్దరి గొత్తికోయ మహిళల బాధిత కుటుంబాలకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్సై వెంకటేశ్వరరావు చేతుల మీదుగా శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గొత్తికోయలు ఆర్‌డీటీ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపించి విద్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. చెడు అలవాట్లతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు, మూఢనమ్మకాలకు దూరంగా ఉంచాలని సూచించారు. అనంతరం రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఏరియా టీం లీడర్ లక్ష్మయ్య మాట్లాడుతూ.. ఆర్‌డీటీ సంస్థ ద్వారా మారుమూల గ్రామాల్లోని పేద ప్రజలకు, ఆదివాసీలకు విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీటీ సంస్థ సీఓ రామకృష్ణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న గోపాలకృష్ణ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం వేలపూరి గోపాలకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆరవ రోజు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అచ్చా నాగేశ్వరావు, సునీల్, రవి తదితరులు ఉన్నారు.

'సాగు నీరందిస్తాం'

ఖానాపురం : పాకాల ఆయకట్టు పరిధిలో చివరి సాగు వరకు గోదావరి జలాలను అందజేస్తామని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయకట్టు పరిధి కాల్వలను, షట్టర్‌లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా పాకాల ఆయకట్టు పరిధిలో పూర్తిస్థాయిలో పంటలు సాగు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఐబీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని అయోధ్యనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ప్రకాశ్‌రావు ప్రారంభించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ రామసహాయం ఉమారాణి, సర్పంచ్‌లు జర్పుల అశోక్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వెంకటాపురం(కె): పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వీరయ్య



మల్హర్: పరామర్శిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): వెంకటాపురం పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు సోదరుడు సత్యనారాయణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య శనివారం పరామర్శించారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిట్టెం వాసు, దాసు, శివతో పాటు గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

మల్హర్: మండలంలోని గాదెంపల్లి గ్రామానికి చెందిన మల్లక్క ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు, చుట్టు పక్కల గ్రామాల రైతులు శనివారం పరామర్శించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మల్హల్‌రావు, సర్పంచ్ రాజునాయక్, సింగిల్ విండో డైరెక్టర్ మొండి, కిషన్, మండల రాహుల్, మహేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలి



మాట్లాడుతున్న కిషన్‌నాయక్

కాటారం: లిక్కర్ స్కాం నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు అజ్మీరా కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని గట్లకుంటలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొట్ట కూటి కోసం గుడుంబా విక్రయించిన వారిపై పీడీ యాక్ట్‌లు, కఠిన చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వాలు లిక్కర్ నిందితులపై అలాంటి చట్టాలే అమలు చేయాలని అన్నారు. లిక్కర్ స్కాంకు పాల్పడిన వారిని పార్టీలకు అతీతంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో లాలూనాయక్, బానోతు రాజు, బాలు, జగపతి, రాజు, సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



తనిఖీ చేస్తున్న కూచన ప్రకాశ్

నల్లబెల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టాలని మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ అన్నారు. పల్లె ప్రగతి డీఎస్ఆర్ యాప్ తనిఖీలో భాగంగా మండలంలోని మామిండ్లవీరయ్యపల్లి గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య, అభివృద్ధి నిర్వహణ పనులను పంచాయతీ కార్యదర్శి సుధాకర్ యాప్‌లో నమోదు చేసిన వివరాలను తనిఖీ యాప్‌లో నమోదు చేశారు. పనుల వివరాలను యాప్‌లో నమోదు చేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ డీఎస్ఆర్ యాప్ నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మేడపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ ఉన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?



కంకర తేలిన మీనాజీపేట రహదారి



దొబ్బల్‌పాడ్ వద్ద కోతకు గురైన రోడ్డు

- ధ్వంసమైన రహదారులు
- ఇబ్బంది పడుతున్న వాహనాదారులు
- పట్టించుకోని అధికారులు

మహాముత్తారం: వర్షాకాలంలో కురిసిన వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారులు, కల్వర్టులు భారీగా కోతకు గురయ్యాయి. దీంతో వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని యామన్‌పల్లి, దొబ్బల్‌పాడ్, ప్రధాన రహదారితో పాటు మహాముత్తారం వెళ్లే లోలెవల్ కల్వర్టులు భారీగా కోతకు గురయ్యాయి. అదే విధంగా నిమ్మగూడెం, సింగంపల్లి, యత్నారం, కనుకునూర్ వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. నర్సింగాపూర్, నల్లగుంట మీనాజీపేట వెళ్లే రహదారి కంకర లేసి గుంతలుగా ఏర్పడ్డాయి. అధికారులు మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని రోడ్డుతో పాటు కేశవాపూర్ పెద్ద వాగు వద్ద తెగిపోయిన రహదారితో పాటు సింగంపల్లి–యత్నారం వద్ద పూర్తిగా తెగిన కల్వర్టులను, రహదారులను కలెక్టర్ ఆదేశాలతో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కానీ అవి కూడా కుంగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. రోడ్లు ధ్వంసమై నెలలు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదని మండలప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులతో పాటు కంకర తేలిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి వాహనాదారులకు మండల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈని వివరణ కోరగా మహాముత్తారం పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారిలో తెగిన రోడ్డుతో పాటు కేశవాపూర్ వద్ద తెగిన రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు.


డ్రైవింగ్ శిక్షణను వినియోగించుకోవాలి



శిక్షణను ప్రారంభిస్తున్న సర్పంచ్‌లు

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తనయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు గండ్ర గౌతంరెడ్డి ఏర్పాటుచేసిన జీఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా యువతకు ఉచిత అందిస్తున్న డ్రైవింగ్ శిక్షణను వినియోగించుకోవాలని పత్తిపాక, కొప్పుల గ్రామాల సర్పంచ్‌లు చిట్టిరెడ్డి, గోలి మాధురిమహేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తోట కుమారస్వామి, ఉపసర్పంచ్ అట్ల తిరుపతి, నాయకులు ఘంటా శ్యాంసుందర్‌రెడ్డి, చిట్టిరెడ్డి జైపాల్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సామల మధుసూదన్ పాల్గొన్నారు.

డాక్టర్ బెజ్జెంకి రాజయ్య మృతి



రాజయ్య (ఫైల్)

టేకుమట్ల: ఐదు దశాబ్దాల కాలం పాటు వైద్య సేవలను అందించిన డాక్టర్ బెజ్జెంకి రాజయ్య హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. 50 సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో కిరణ్ క్లీనిక్ పేరుతో వైద్య సేవలను కొనసాగించిన డాక్టర్ రాజయ్య నిర్విరామంగా వైద్య వృత్తిలో కొనసాగారు. జిల్లాతో పాటు, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలలోని పలు ప్రాంతాల ప్రజలకు సైతం వైద్య సేవలను అందించిన ఘనత ఆయనది. గతంలో చిట్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి సౌకర్యం లేకపోవడంతో వందల సంఖ్యలో ప్రసూతి కాన్పులను సైతం చేశాడు. అంతే కాకుండా వాస్తు, జ్యోతిష్యం లో పాండిత్యం కలిగి ఎంతో మందికి వాస్తు, జ్యోతిష్యం చెప్తూ అందరికి కుటుంబ సభ్యుడిలా మారిపోయాడు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం

ఆత్మకూరు: మండలంలోని చౌళ్లపల్లిలో శనివారం హనుమాన్ ఆలయంలో ఆంజనేయస్వామి యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, పోచమ్మ, గ్రామదేవతల విగ్రహాలు, యంత్ర ప్రతిష్ఠలను యాజ్ఞికులు బీటుక్కారి విజయసారథి ఆచార్యులు, ఆరుట్ల కేశవమూర్తి వేద మంత్రోచ్ఛరణలతో చేపట్టారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కంచ రవికుమార్, ఎంపీటీసీ బొమ్మగాని భాగ్యరవిగౌడ్, ఉపసర్పంచ్ పూజారి స్వప్న, ఎర్రెడ్డి లింగారెడ్డి, గ్రామస్తులు, భక్తులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.